## జోగుళాంబ సన్నిధిలో డీఎఫ్‌వో

బాల బ్రహ్మేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి

అలంపూర్, మార్చి 24 : పట్టణంలోని జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను జిల్లా ఫారెస్ట్ అధికారి నవీన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం కు టుంబ సభ్యులతో ఆలయానికి వచ్చిన డీఎఫ్‌వోకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం బాల బ్రహ్మేశ్వరస్వామికి అభిషేకం, అమ్మవారికి అర్చనలు, పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రథంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

అయిజ, మార్చి 24 : మండలంలోని ఉత్తనూరు ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మేళా తాళాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ధన్వంతరి వేంకటేశ్వరస్వామితోపాటు జనార్దనస్వామి, లక్ష్మీదేవికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు వేద పండితులు కల్యాణం నిర్వహించారు. అనంతరం రథంపై ఆశీనులైన శ్రీవారిని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు క్యూరింగ్

సీసీ రోడ్డు పనులకు క్యూరింగ్ చేస్తున్న కూలీలు

నమస్తే ఎఫెక్ట్

అమరచింత, మార్చి 24: మండలంలోని ధర్మాపూర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల కు గుత్తేదారు కూలీలతో ముమ్మరంగా క్యూరింగ్ చేయిస్తున్నారు. గ్రా మంలో రూ.15లక్షలతో నా లుగు రోజుల నుంచి చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గుత్తేదారు సరిగా క్యూరింగ్ చేయించక పోవడంతో నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ఇష్టారాజ్యంగా సీసీరోడ్డు నిర్మాణ పనులు' అనే కథనం ఆదివారం ప్రచురితం కాగా దీనిపై అధికారులు స్పందించారు. గ్రామంలో వేస్తున్న సీసీరోడ్డు పనులకు వెంటనే కూరింగ్ చేయాలని గుత్తేదారుకు ఆదేశించడంతో కూలీలతో ముమ్మరంగా నీళ్లు పోయిస్తు న్నాడు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రతిపక్షాలపై కేంద్ర ప్రభుత్వం కుట్ర: సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అలంపూర్, మార్చి 24: పార్లమెంటు ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రతిపక్ష పార్టీలపై ఈడీ, సీబీఐలను ఉపయోగిస్తూ వాటిని దెబ్బకొట్టెందుకు కుట్ర చేస్తున్నదని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రతిపక్ష పార్టీ నాయకులను స్కాముల పేరుతో అరెస్టు చేసి వారిని మానసికంగా ఇబ్బంది పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. డిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను లిక్కర్ స్కాం చేశాడని అరెస్టు చేయడం దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికల వేళ అధికార పార్టీకి ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో వేలకోట్లు లబ్ధిపొందడమే కాకుండా ప్రతిపక్ష పార్టీల ఎలక్ట్రోరల్ బాండ్లను సీజ్‌చేసి ఆపార్టీలను ఆర్థికంగా దెబ్బ కొడుతోందన్నారు. సమావేశంలో పార్టీ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★ I, KHAJA MAINODDIN, S/o GUL MOHAMMED, R/o: 5-80, Subash Nagar, Kalwakurty, Nagarkurool - 509324, Changed My Name as MOHAMMED KHAJA MOINUDDIN
NT-MBNR

CHANGE OF NAME
★ I, KHAJA MYNADDIN, S/o: GUL MOHAMMED, R/o: 5-80, Subash Nagar, Kalwakurty, Nagarkurool - 509324, Changed My Name as MOHAMMED KHAJA MOINUDDIN
NT-MBNR

CHANGE OF NAME
★ I, MD KHAJA MYNADDIN, S/o: GUL MOHAMMED, R/o: 5-80, Subash Nagar, Kalwakurty, Nagarkurool - 509324, Changed My Name as MOHAMMED KHAJA MOINUDDIN
NT-MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# పేదోడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ

- అందుబాటు ధరల్లో కుండలు
- మార్కెట్‌లో వివిధ ఆకృతుల్లో లభ్యం

మల్దకల్ సంతలో కుండలు కొనుగోలు చేస్తున్న జనం

మల్దకల్, మార్చి 24 : పేదల ఫ్రిజ్‌గా మన్నలు పొందుతున్న కుండలకు వేసవిలో భలే గిరాకీ ఉంటుంది. ధనవంతులు వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ఫ్రిజ్‌లను కొనుగోలు చేసి చల్లని నీటితో వేసవి తాపాన్ని తీర్చుకుంటే లేని వారు కుండలోనీటిని తాగుతూ వడదెబ్బ నుంచి తమని తాము కాపాడుకుంటున్నారు. అందుకే ఈ కుండలు పేదల ఫ్రీజ్‌లుగా అభివర్ణిస్తారు. వీటికి కరెంట్‌తో పనిలేదు. సహజ సిద్ధంగా తయారు చేసిన ఈ కుండలు, కృతిమంగా తయారు చేసిన ఫ్రిజ్‌ల కంటే ఎంతో మెరుగ్గా పనిచేస్తాయి. ప్రస్తుతం వీటి ధర మార్కెట్‌లో రూ.50-200వరకు అందుబాటులో ఉంటాయి. మార్కెట్‌లో కుండలు వివిధ ఆకృతుల్లో మనకు లభ్యమవుతాయి. కుండలు తెచ్చుకొని ఇంట్లో కొంత ఇసుక పోసి కుండను దానిపై పెట్టినట్లయితే దానిలోని నీరు ఎంతో చల్లగా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో కుండలను తయారు చేసి ప్రత్యేకంగా బట్టీల్లో కాల్చి వాటిని అమ్మకానికి సిద్ధం చేస్తారు. ఎండకాలం నుంచే వీటి అమ్మకాలు ప్రారంభమవుతాయి. కుండలో పోసిన నీళ్లు చల్ల బడటానికి వాటిని తయారు చేసే మట్టిని బట్టి ఆధారపడి ఉంటుంది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో కుండల్లోనే పాలను కాచి పెరుగుకు తోడు పెడుతుంటారు. అలాగే మజ్జిగా కుండల్లో చిలకడం వల్ల మంచి రుచి వస్తుందని చెబుతారు పెద్దలు. ఫ్రిజ్‌ల కంటే కుండల్లో నీటిని తాగడం మంచిదని డాక్టర్లు చెబుతుంటారు. ఏడాది అంతా తయారు చేసి కుండలను వేసవిలో అమ్ముకొని గ్రామీణ ప్రాంతాల్లోని కుమ్మరులు జీవనం సాగిస్తారు. వేసవి కాలమంతా అందరి మన్నలు పొందుతున్న ఈ కుండలు ఎందరికో ఉపాధి కల్పిస్తుంటాయి. మార్కెట్‌లో ఎన్నో రకాల రిఫ్రిజిరేటర్లు అందుబాటులో ఉన్నా కుండలకు మాత్రం డిమాండ్ తగ్గదని కుండలు అమ్మేవారు అంటున్నారు.

## సమస్యలు పరిష్కరించేందుకు కృషి

గద్వాలటౌన్, మార్చి 24: ఆయుర్వేద వైద్యుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలంగాణ ఆయుస్మాన్ ఆర్యోగ మందిర్ పల్లెదవాఖాన ఆయుర్వేదిక్ వైద్యాధికారుల రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో గద్వాలకు చెందిన రవీందర్ విజయం సాధించి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఇందుకు గానూ ఆయనను ఆదివారం జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెదవాఖానలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దవాఖానలో సరైన వసతుల కల్పన లేదని వెంటనే అన్ని వసతులు కల్పించేందుకు పాటుపడతానని చెప్పారు. కార్యక్రమంలో సీసీ వెంకటేశ్, తిరుమల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

చిన్నంబావి, మార్చి 24: మండలకేంద్రంలో ఆదివారం కేఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని ట్రస్ట్ చైర్మన్ కొత్త కల్యాణ్‌కుమార్ తనయుడు అన్నరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలకేంద్రానికి నిత్యం మండల ప్రజలు ఆయా పనులపై వస్తుంటారని, వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, నాయకులు మోహన్‌యాదవ్, గంగాధర్‌యాదవ్, జగదీశ్, విష్ణురెడ్డి ఉన్నారు.

## పెంచిన ఫీజు వెంటనే తగ్గించాలి

గద్వాలటౌన్, మార్చి 24 : పెంచిన టెట్ ఫీజును వెంటనే తగ్గించాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పేరు నర్సింహ డిమాండ్ చేశారు. పెంచిన ఫీజును నిరసిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అధిక ఫీజులు లేకుండా పరీక్షలు నిర్వహిస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందని ఆరోపించారు. నిరుద్యోగుల మీద అధిక భారం మోపడమే నా ప్రభుత్వ లక్ష్యమని ప్రశ్నించారు. గతంలో మూడు వందల రూపాయల రుసుము ఉండగా రెండువేలకు పెంచడం దారుణమన్నారు. నిరుద్యోగ భృతి ఇచ్చేది పోయి నిరుద్యోగులను దోచుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రమేశ్, చందు, నరేశ్, నర్సింహులు, రంగస్వామి శ్రీను పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్ పోటీలు

పెద్దమందడి, మార్చి 24: మండలంలోని దొడగుంటపల్లిలో పది రోజుల నుంచి కొనసాగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు తాడిపర్తి, దొడగుంటపల్లి జట్లు ఫైనల్‌లో తలపడగా తాడిపర్తి జట్టు విజయం సాధించింది. గెలుపొంది న జట్టుకు ఎస్సై శివకుమార్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు జగదీశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, రాఘవేంద్రరెడ్డి, నిర్వాహకులు రవీందర్, కురుమూర్తి , రాజు, మహేశ్ పాల్గొన్నారు.

## భగవద్గీతపై విస్తృత ప్రచారం

భగవద్గీతపై ప్రచారం చేస్తున్న భక్తులు

కొత్తకోట, మార్చి24 : మండలంలోని విలియంకొండ, నాచారంపేట గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. హోలీని రసాయనిక రంగులు లేకుండా సహజ సిద్ధమైన రంగులతో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాసన్న, గోపాల్, శివ, సిమ్మయ్య, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ పాల్గొన్నారు.

## హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

- వనపర్తి ఎస్పీ రక్షితా కృష్ణమూర్తి

మాట్లాడుతున్న ఎస్పీ రక్షితా కృష్ణమూర్తి

వనపర్తి టౌన్, మార్చి 24 : హోలీ పండుగను సాంప్రదాయ బద్ధంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ రక్షితా కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం ఆమె జిల్లా ప్రజలకు హోలీ పండుగపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యువత మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా ప్రజలు సురక్షితమైన రంగులను వాడి పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. హోలీ అనంతరం చెరువులు, లోతట్లు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. యువత, చిన్నారులను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని పండుగలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ముందస్తుగానే వారికి సూచించాలన్నారు. అతివేగంగా, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ లాంటివి చట్టవిరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

### రసాయన రంగులు వాడొద్దు

ఆత్మకూరు, మార్చి 24 : హోలీ పండుగ మోజులో రసాయనాలు కలిపిన కలర్లను వాడితే ప్రమాదం బారిన పడకతప్పదని ఎస్సై వాకిటి నరేందర్ హెచ్చరించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన హోలీ పండుగ సందర్భంగా యువకులు, చిన్నారులపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పండుగ పూర్తయిన తర్వత చాలామంది యువకులు, పెద్దలు స్నానాలు చేసేందుకు కాల్వలు, బావుల వద్దకు వెళ్తుంటారు. అలా వెళ్లకుండా ఇంటివద్దనే రంగులు కడుక్కొవడం ఉత్తమమని అన్నారు. కొందరు యువకులు కాల్వల వద్దకు వెళ్లి మద్యం తాగి ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇలాంటి ఘటనలకు తావివ్వకుండా ఇండ్ల వద్దే స్నానాలు చేసుకోవడం మంచిదన్నారు. అదేవిధంగా కృత్రిమ రంగులు వినియోగించకుండా సహజసిద్ధమైన రంగులను ఉపయోగించి పండుగ చేసుకోవాలని సూచించారు.

### సురక్షితమైన రంగులు వాడాలి

పాన్‌గల్, మార్చి 24 : హోలీపండుగను ప్రజలు ప్రశాంతవాతావరణంలో సాంప్రదాయ పద్ధతులు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు లేకుండా నిర్వహించుకోవాలని ఎస్సై వేణు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువత మద్యం తాగి వాహనాలను వేగంగా నడపడం, త్రిపుల్ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. సురక్షితమైన రంగులు వాడాలని, అనంతరం బావులు, చెరువుల్లో స్నానాలు ఆచరించే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## ఘనంగా కామదహనం

పొల్కెపహాడ్‌లో కామ దహనం చేస్తున్న గ్రామస్తులు

వనపర్తి, మార్చి 24: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ పండుగను పురస్కరించుకొని ఆదివారం రాత్రి కామదహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కడుకుంట్ల, పెద్దగూడెం, చిట్యాల, చిమనగుంటపల్లి తదితర గ్రామాల్లోని యువకులు,పెద్దలు, చిన్నారులు కలిసి సంప్రదాయ బద్ధంగా కాముడిని బొమ్మగా ఊరేగించి దహనం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, యువకులు, చిన్నారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### గోపాల్‌పేట మండలంలో..

గోపాల్‌పేట, మార్చి 24 : హోలీ పండుగ సందర్భంగా గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో ఆదివారం రాత్రి గ్రామస్తులు కాముడిని దహనం చేశారు. పొల్కెపహాడ్‌లో బొడ్రాయి వద్ద ఇంటింటి నుంచి సేకరించిన పేడ పిడకలను పేర్చి కామ దహనం చేశారు. అనంతరం కామ దహనం బూడిద తమ ఇండ్లకు గ్రామస్తులు తీసుకువెళ్లారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు

నందిన్నె వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది

కేటీదొడ్డి, మార్చి 24 : తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ పోలీసులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు, ఎంపీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి వాహనం తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా లిక్కర్ తరలించి పట్టుబడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### అమరచింత మండలంలో..

అమరచింత, మార్చి 24 : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నాగల్‌కడ్మూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అధికారులు తనిఖీలను మమ్మురం చేశారు. నారాయణపేట, వనపర్తి జిల్లాలకు నాగల్‌కడ్మూర్ గ్రామం సరిహద్దు కావడంతో ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేయగా వచ్చిపోయే ప్రతి వాహనాన్ని అధికారులు సిబ్బందితో తనిఖీలు చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రూ.50వేలకు మించి ఎలాంటి ప్రతాలు లేకుండా నగదు తీసుకెళ్తే వెంటనే సీజ్ చేసి గ్రీవెన్స్ అందజేస్తున్నారు.

నాగల్‌కడ్మూర్ వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది

కొత్తకోట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

# భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

కొత్తకోట, మార్చి24 : ఈస్టర్ పండుగను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని క్రైస్తవులు మట్టల ఆదివారం నిర్వహించారు. చిన్నారులు, ఫాస్టర్లు పట్టణంలోని పురవీధుల గుండా ఈత మట్టలు, శిలువను చేత పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఏడాది ఈస్టర్ పండుగ ముందు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఫాస్టర్ సైమన్ తెలిపారు. కార్యక్రమంలో ఆనందం, ప్రే మన్న, జయన్న, నాగభూషణం, నిక్సన్, భాస్కర్, దయాకర్‌రావు, కరుపయ్య , కిరణ్, మహేశ్ ఉన్నారు.

### అయిజ మండలంలో..

అయిజ, మార్చి 24 : పట్టణంలోని ఎంబీ బెతేలు చర్చి పాస్టర్ రెవరెండ్ సీమోను ఆధ్వర్యం లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా ఎస్సీ కాలనీ నుంచి పురవీధుల గుండా ఈ త మట్టలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

### ధరూర్ మండలంలో..

ధరూరు, మార్చి 24 : మండల కేంద్రంలో ఈస్టర్ పండుగను పురస్కరించుకొని ఫాస్టర్ కృపరాజు ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టల ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు, ఈత మట్టల ర్యాలీ నిర్వహించారు.

అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ధరూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

## మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, మార్చి 24 : మండలంలోని దంతనూరు గ్రామాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదివారం స్థానిక నాయకులతో కలిసి సందర్శించి, హెల్త్‌క్యాంపు నిర్వహిస్తున్న వైద్య బృందంతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సయం అయ్యేంత వరకు గ్రామంలో వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. ప్రజలు ధైర్యంగా ఉంటూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తూ పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు భవాని, ఆరోగ్య సిబ్బంది, కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

## 28న ప్రజల వద్దకే పోలీసు

వడ్డేపల్లి, మార్చి 24: మండలంలోని పోలీస్ స్టేషన్‌లో ఈనెల 28న ప్రజల వద్దకే పోలీసు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్సీ రితిరాజ్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. తమ సమస్యలను తెలిపేందుకు జిల్లా కేంద్రానికి రాలేని వారు ఫిర్యాదులు పరిష్కారం కాలేదని భావించిన వారు ఇతర బాధితులు 28వ తేదిన శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నేరుగా తనను కలిసి ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదులను పరిశీలించి, పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

## కోతి పిల్లకు దహన సంస్కారాలు

కోతిపిల్లకు దహన సంస్కారాలు చేస్తున్న చిన్నారులు

వనపర్తి, మార్చి 24 : ఆలయం పై నుంచి కిందపడి మృతి చెందిన కోతిపిల్లకు చిన్నారులు దహనసంస్కారాలు చేసి ఔరా అనిపించుకున్న ఘటన వనపర్తి జిల్లా వనపర్తి మండలంలోని కడుకుంట్లలో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. ఓ కోతి తన పిల్లతో గ్రామంలోని ఆలయ గోపురంపైకి ఎక్కుతున్న సమయంలో కోతి పిల్ల జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గుర్తించిన చిన్నారులు కోతిపిల్లను ఊరి బయటకు తీసుకువెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. గ్రామస్తులు చిన్నారులను అభినందించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గట్టు, మార్చి 24 : మండల కేంద్రంలో విద్యుత్ లైన్‌లకు సమీపంలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున తొలగించనున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీ గోవిందు, ఏఈ చిన్నయ్య ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. దీనికిగానూ సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా మాచర్ల సబ్‌స్టేషన్ నుంచి మిట్టదొడ్డికి వెళ్లిన లైన్‌లో కూడా చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో కూడా అదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ అంతరాయాలకు వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

## అంగన్‌వాడీ టీచర్‌కు ఆర్థికసాయం

పాన్‌గల్, మార్చి24 : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ అలివేల గాయపడి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో అలివేలకు వైద్య ఖర్చుల నిమిత్తం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.1,34,700 నగదు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, నాయకులు రాజు, నిక్సన్, రమేశ్, రాము, నారాయణమ్మ, కవిత పాల్గొన్నారు.

## తోటి మిత్రులకు..

ఆర్థికసాయం అందజేస్తున్న మిత్ర బృందం

పెబ్బేరు, మార్చి 24 : ఆపదలో ఉన్న తోటి మిత్రులకు ఆర్థిక సాయం అందజేసి తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు. పెబ్బేరు హైస్కూల్‌లో 2005 ఏడాదిలో పదో తరగతి చదివిన విద్యార్థుల్లో ఇద్దరికి ఆర్థిక ఇబ్బందులు ఉన్న విషయం తోటి మిత్రులు తెలుసుకున్నారు. వెంటనే ఒకరికొకరు సంప్రదించుకొని ఆదివారం వారు చదువుకున్న పాఠశాలకు చేరుకొని జానంపేట జ్యోతికి రూ. 50వేలు, నేష కవితకు రూ. 60వేలు అందజేసి ఉదారతను చాటుకున్నారు.

## బెంచీల వితరణ

కొత్తకోట, మార్చి 24 : పట్టణంలోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద సందర్శకులు కూర్చోవడానికి రెండు సిమెంట్ బెంచీలను వితరణ చేసినట్లు స్టార్ ఆంజనేయులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఛత్రపతి వాకింగ్ టీం సభ్యులతో కలిసి సందర్శకులకు అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో బెంచీలను వితరణ చేసినట్లు ఆయన తెలిపారు.